
సాక్షి ఒడిశా

మంగళవారం। 4। ఫిబ్రవరి। 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,84,725లు, బంగారం 450 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాముల 450 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అనూహ్య స్పందన

ప్రజా ఫిర్యాదుల విచారణకు అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారు. - 8లో



ఉత్సాహంగా వంటల పోటీలు

గుణుపూర్‌లో వంటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వంటలు ఆకట్టుకున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో 25 క్వింటాళ్ల పత్తి దగ్ధం



పత్తి లోడుతో వెళుతున్న లారీ

రాయగడ: పత్తి లోడుతో వెళ్తున్న ఒక లారీకి విద్యుత్ తీగలు తాకడంతో మంటలు చెలరేగి 25 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదైంది. ఈ ఘటన జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సికరపాయి ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పత్తి వ్యాపారి వెంకటేశ్వరరావు ఒక లారీలో 55 క్వింటాళ్ల పత్తిని లోడు చేసి రాయగడలో గల మండీకి తరలిస్తుండగా సికరపాయి బ్యాంకు కూడలి వద్ద విద్యుత్ తీగ తగిలి పత్తి కాలిపోయింది. పొగలు కమ్ముకోవడంతో అక్కడి వారు చూసి వెంటనే లారీ డ్రైవర్ కిందకు దిగిపోయాడు. స్థానికులు స్పందించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే పత్తి కాలిపోయింది.

76 వినతుల స్వీకరణ



వినతులను వింటున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు అనూహ్య స్పందన లభించింది. కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 76 వినతులను అధికారులు స్వీకరించారు. ఇందులో భాగంగా 65 వ్యక్తిగత సమస్యలు కాగా 11 గ్రామ సమస్యలుగా గుర్తించారు. నిరుపేదలైన 10 మందికి కలెక్టర్ పట్వారి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.82 వేల ఆర్థిక సాయం అందజేశారు. వినతుల్లో 15 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

హస్తకళల దుకాణాలు దగ్ధం



దుకాణాల సముదాయంలో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్: కోణార్క్‌లోని దుకాణాల సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 15కి పైగా హస్తకళల దుకాణాలు దగ్ధమయ్యాయి. పరిసరాల్లో మరో 10 దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ దుర్ఘటనలో లక్షల రూపాయల విలువైన సామగ్రి కాలిపోయింది.

ఎలుగుబంట్ల దాడులపై చైతన్యం



కొలాగుడ గ్రామంలో వీడియో ప్రదర్శన ద్వారా ఎలుగుబంట్ల దాడులపై ప్రజలను చైతన్యపరుస్తున్న అటవీ అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో ఎలుగుబంట్లు మనుషులపై తరచూ దాడులు చేస్తున్నాయి. ఆ దాడులలో పలువురు గాయపడటం, మృత్యువాత పడుతున్నారు. ఈనేపథ్యంలో ఎలుగుబంట్ల దాడుల నుంచి ఎలా రక్షణ పొందాలో అటవీ అధికారులు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గొడొపొదర్ పంచాయతీ కొలాగుడ గ్రామంలో అటవీ విభాగ అధికారులు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. జయపురం ఫారెస్టర్ శశాంక మహారాణ ప్రాజెక్టు ద్వారా వీడియో వేసి ప్రజలకు ఎలుగుబంటిపై అవగాహన కల్పించారు. జయపురం అటవీ డివిజన్‌లో కొన్ని ప్రాంతంలో ఎలుగుబంట్లు స్వైర విహారం చేస్తున్నాయని.. వాటివలన ప్రజలు భయపడుతున్నారని వెల్లడించారు. పలు ప్రాంతాలలో ఎలుగు బంట్ల దాడులలో గాయపడులున్నారని అందుకు ప్రధాన కారణం ఎలుగుబంట్లపై గ్రామీణ ప్రజలలో అవగాహన అంతగా లేక పోవటమేనని జయపురం రేంజర్ సచిదానంద పొరిడ వివరించారు. ముఖ్యంగా ఎలుగుబంట్ల నుండి మనుషులను, మనుషుల నుంచి ఎలుగు బంట్లను రక్షించేందుకు ఇటువంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎలుగు బంట్లు ఎటువంటి ఆహారం తినేందుకు ఇష్టపడతాయి, అడవులలో ఆహారం కొరత కారణంగా అవి గ్రామ ప్రాంతాలకు వస్తున్నాయని వెల్లడించారు. అడవికి వెళ్లే ప్రజలు ఎలుగు బంట్ల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, దాడి చేస్తే వాటి నుంచిఎలా బయట పడాలి మొదలగు విషయాలను వీడియో ద్వారా ప్రజలకు చూపించారు. గ్రామంలోనికి ఎలుగుబంట్లు వస్తే వాటిని ఎలా పారదోలాలో అవగాహన కల్పించారు.

ఘనంగా .. విక్రమదేవ్ వర్సిటీ వేడుకలు



ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



విక్రమదేవ్ వర్మకు నివాళులర్పిస్తున్న బాహిణీపతి

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ రెండో ప్రతిష్టా వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు రిజిస్ట్రార్ రంజిత కుమార్ అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా స్వర్గీయ విక్రమదేవ్ వర్మ శిలా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి అతిథులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంతో శ్రమించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావటంతో విశ్వవిద్యాలయం సాకారమైందన్నారు. జయపురంలో వర్సిటీ ఏర్పాటుతో అవిభక్త కొరాపుట్ కళాశాలలో విద్యార్థులు ఉన్నత చదువులకు ఇతర ప్రాంతాలకు వెల్లవసిన శ్రమ తప్పిందని అన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్టు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు హాస్టల్‌లో ఉంటున్నారని .. వారి కోసం వంటగది, డైనింగ్ హాల్, శౌచాలయం, రక్షిత తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేద్దామన్నారు. విశ్వవిద్యాలయంలో బీఈడీ ప్రారంభించిన తరువాత అవిభక్త కొరాపుట్ జిల్లాల విద్యార్థులు ఎంతో లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి.. బాగా చదువుకొని విశ్వవిద్యాలయానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం ఏర్పడి రెండేళ్లయిందని.. ఈ సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నాయన్నారు. ఈ ఏడాది పరిశోధన పాఠ్యాంశాలు ప్రారంభించనున్నట్లు యూనివర్శిటి కులపతి ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ మిశ్ర వెల్లడించారు. రిజిస్ట్రార్ రంజిత్ కుమార్ ప్రధాన్ వార్షిక నివేదిక సమర్పించారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పి.కె.పాత్రో, ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్‌లు కళాశాల విద్యాప్రగతిని ప్రశంసిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. బరంపురం విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి జయంతకుమార్ మహాపాత్రో, ప్రశాతం కుమార్ పాత్రో పాల్గొన్నారు.



మహాత్మునికి శ్రద్ధాంజలి ఘటిస్తూ..



పీకే పాత్రోను సన్మానిస్తున్న అతిథులు



వేదికపై నాయకులు, వర్సిటీ ప్రతినిధులు

నేడు మాఘ సప్తమి



చంద్రభాగ తీరం

- చంద్రభాగ తీరంలో 33 ప్లటూన్ల పోలీసు బలగాలు

భువనేశ్వర్: పవిత్ర మాఘ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పూరీ జిల్లా కోణార్కు చంద్రభాగలో పుణ్య స్నానాలు చేసేందుకు తండోప తండాలుగా భక్తులు తరలి వస్తారు. ఈ తీరంలో మాఘ సప్తమి పురస్కరించుకుని సూర్యభగవానుడికి పూజలు చేయడం ఆచారం. ఇక్కడ స్నానం చేయడం వల్ల చర్మ వ్యాధులు తొలగిపోతాయని విశ్వసిస్తారు. చంద్రభాగ తీరంలో శ్రీకృష్ణుని కుమారుడు సాంబుడు 12 ఏళ్లు సూర్య దేవుడిని జపించి స్నానం చేయడంతో కుష్టు వ్యాధి నుంచి విముక్తి పొందినట్లు పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. ఈ సందర్భంగా చంద్రభాగ తీరంలో అవాంఛనీయ సంఘటనల నివారణకు పూరీ జిల్లా యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తుంది.

33 ప్లటూన్ల పోలీసుల మోహరింపు

మాఘ సప్తమి పురస్కరించుకుని చంద్రభాగ తీరంలో రద్దీ పట్ల నిఘా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీ పోలీసు బందోబస్తు చేశారు. సమగ్రంగా 33 ప్లటూన్ల పోలీసు బలగాల్ని మోహరించారు. ఆరుగురు అదనపు పోలీసు సూపరింటెండెంట్లు, 13 మంది డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు, 39 మంది ఇన్‌స్పెక్టర్లు చంద్రభాగ తీరంలో శాంతిభద్రతల కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. వీరిలో స్నానం చేసే తీరాల్లో తలెత్తే ఆకస్మిక ప్రమాదాల్లో తక్షణ సహాయక చర్యల కోసం లైఫ్ గార్డులను మోహరిస్తున్నారు.

కోణార్కు ఆలయం సందర్శన రుసుం మినహాయింపు

పవిత్ర స్నానం తర్వాత, యాత్రికులు సూర్య దేవాలయ ప్రాంగణంలోని నవ గ్రహ ఆలయంలో పూజార్చనలు చేస్తారు. ఈ సందర్భంగా సూర్య దేవాలయం సందర్శన ప్రవేశ రుసుం మినహాయించినట్లు పూరీ జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

ట్రాఫిక్ నియంత్రణ

మాఘ సప్తమి సందర్భంగా చంద్రభాగ తీరం పరిసరాల్లో వాహనాల రద్దీ నియంత్రణకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రధాన మార్గాల గుండా వాహనాల రాకపోకల్ని వివిధ మార్గాల గుండా దారి మళ్లించే ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజలు




సిటీ స్కూల్‌లో పూజలందుకున్న సరస్వతీదేవి



విక్రమ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో సరస్వతీ దేవి ప్రతిమ

జయపురం: జయపురంలో ఆదివారం ప్రారంభమైన సరస్వతీపూజలు సోమవారంతో ముగిశాయి. స్థానిక నెహ్రూనగర్‌లో తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహణలో నడుస్తున్న జయపురం సిటీ స్కూల్‌లో చదువుల తల్లి సరస్వతీ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పూజలు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి.సుజాత పర్యవేక్షణలో జరిగాయి. విద్యార్థులకు సరస్వతీ దేవికి పూలు, పండ్లను సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుజాత, సిటీ కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయక్, సిటీ ఎంఈ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు మాధవి, తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షులు ధిరేష్ పట్నాయక్, పాఠశాల కమిటీ అధ్యక్షులు అరుకుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులతో పాటు ఇంగ్లిషు, తెలుగు పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు సమీప కెనాల్‌లో సరస్వతీదేవి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కాలిబూడిదైన కారు



స్థానిక నయాపల్లి ప్రాంతంలో నిలిపి ఉన్న కారులో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. మంటలు ఎలా చెలరేగాయో తెలియరాలేదు.

భువనేశ్వర్

గ్రీవెన్స్‌కు 89 వినతులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



పర్లాకిమిడి: ప్రజల నుంచి వినతులను అందుకుంటున్న ఉన్నతాధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ ముఖీపరిపాలన, గ్రీవెన్సుసెల్‌కు అధిక స్పందన లభించింది. కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్, ప్రొబేషనరీ ఐఎఫ్‌ఎస్ సిద్ధార్థజైన్‌లు పాల్గొన్నారు. కెరండి, పర్లాకిమిడి పురపాలక, సిద్ధమణుగు, రాణిపేట గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 89 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 74, గ్రామ సమస్యలు 15 వచ్చాయి. వాటిలో తొమ్మిది వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, సీడీఎంవో డాక్టర్ మహామ్మద్ ఎం.ఆలీ, తహసీల్దార్ నారాయణ బెహరా, గుసాని బీడీవో గౌర చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

మారువేషంలో వెళ్లిన కలెక్టర్



మారు వేషంలో భద్రక్ జిల్లా కలెక్టర్ దిలీప్ రౌత్రాయ్



భువనేశ్వర్: భద్రక్ జిల్లా కలెక్టర్ దిలీప్ రౌత్రాయ్ మారు వేషంలో వెళ్లి వరి మండీని సందర్శించారు. భద్రక్ జిల్లా ధామ్‌నగర్ మండలం కటసాహి మండి వద్ద వరి కొనుగోలులో అక్రమాల ఆరోపణల నిగ్గు తేల్చేందుకు రైతు వేషధారణలో మండీని సందర్శించారు. వరి విక్రయించేందుకు విచ్చేసిన రైతులతో కలిసి మెలిసి తిరుగాడుతూ అక్కడి అక్రమాలపై ఆరా తీశారు. రైతు ఆరోపణల ఆధారంగా అక్రమాలను నిర్ధారిస్తూ పీఏసీఎస్ అధికారులని నిలదీశారు. ఆరోపణలు రుజువు కావడంతో సంబంధిత అధికారులకు వివరణ కోరుతూ తాఖీదులు జారీ చేశారు. నాణ్యత లోపం మిషతో కనీస మద్దతు ధర కంటే తక్కువగా వరి కొనుగోలు చేసి రైతులకు అన్యాయం చేసినట్లు ప్రధాన ఆరోపణ. కలెక్టర్ తన వాహనాన్ని దూరంగా పార్క్ చేసి, షార్ట్, టీ–షర్టు ధరించి ముఖానికి మాస్క్ తొడుక్కుని కటాసాహి పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)కి చేరారు. ఈ వేషధారణలో నడుచుకుంటూ మండీలో నలుమూలల వరి కొనుగోలు వ్యవహారాల్ని గోప్యంగా పరిశీలించి వాస్తవంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్ధారించుకుని ఘాటుగా స్పందించారు. తన గుర్తింపును వెల్లడించకుండా కలెక్టర్ రైతులతో మాట్లాడి వరి విక్రయాలపై ఆరా తీశారు. వేరొక రైతు టోకెన్‌ను ఉపయోగించి వడ్లను విక్రయించేందుకు వచ్చిన రైతులా వ్యవహరించారు. ఈ వ్యవహారంలో విక్రయించేందుకు దాఖలు చేసిన వరిలో సుమారు 8 కిలోల వరి వృథాగా పరిగణించి కొనుగోలు చేసేందుకు అంగీకరించడంతో రైతుల వేధింపుల ఆరోపణ నిజమని తేలాయి. ఈ అనుభవం ఆధారంగా పీఏసీఎస్ అధికార వర్గాల వ్యతిరేకంగా చర్యలు చేపట్టేందుకు సంతృప్తికరమైన వివరణ కోరారు. ఈ మేరకు 2 రోజుల గడువుతో కటసాహి పీఏసీఎస్ కార్యదర్శికి తాఖీదులు జారీ చేశారు. గడువులోగా సంతృప్తికర వివరణ దాఖలు చేయకుంటే ఏకపక్ష నిర్ణయంతో తగిన చర్యలు చేపట్టనున్నట్లు తాఖీదులో స్పష్టం చేశారు.

బాలాసోర్‌లో రోడ్డు ప్రమాదం

భువనేశ్వర్: బాలాసోర్‌లో రోడ్డు ప్రమాదం సంభవించింది. 60వ నంబరు జాతీయ రహదారి అంబులియాఒటా సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కంటైనర్ పైకి మరో కంటైనర్ దూసుకు పోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. వెనుక నుంచి ఢీకొన్న కంటైనర్ డ్రైవర్ రెండింటి మధ్య నలిగి పోయాడు. సత్వర సహాయక చర్యలతో డ్రైవర్‌ని ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఉదయం పొగమంచు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



కంటైనర్ల మధ్య నలిగిన డ్రైవరు



ప్రమాదం దృశ్యం

ఖనిజ సంపద కాపాడాలని వినతి

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను కలిసిన ఆదివాసీ మహా సంఘం నేతలు



మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను కలిసిన కొరాపుట్ జిల్లా ఆదివాసీ మహా సంఘ నేతలు

జయపురం: కొరాపుట్ జిల్లాలో ఖనిజ సంపద అక్రమ తవ్వకాలపై కొరాపుట్ జిల్లా ఆదివాసీ మహా సంఘం నేతలు ఆదివారం మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నామక్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలోని 14 సమితుల నుంచి పలువరు ఆదివాసీ మహాసంఘ కార్యకర్తలు భువనేశ్వర్‌లో నవీన్ పట్నాయక్‌ను కలిశారు. ఖనిజ తవ్వకాలపై ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని వివరించారు. కొరాపుట్ జిల్లా జలం, జంగిల్, భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒడిశాలోని ఖనిజ సంపదను కొల్లగొట్టి బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తామనడాన్ని ఆదివాసీ మహా సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. జలం, జంగిల్, భూమిని పరిరక్షించకపోతే భవిష్యత్తులో ఖనిజ సంపద కనుమరుగు అవుతుందని, ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జయపురం సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మనధర గదబ, జయపురం సమితి పొరజ సమాజ్ అధ్యక్షుడు త్రినాథ్ ముదులి, జయపురం పెండియ సమాజ్ అధ్యక్షుడు బైద్యనాత్ నాయక్, బొరిగుమ్మ సమితి ప్రతినిధి కుములు జాని, లక్ష్మీనారాయణ ముదులి, కొట్‌పాడ్ సమితి ప్రతినిధి నహర నాయక్, నీలకంఠ నాయక్, కుంద్ర సమితి ప్రతినిధులు భజమన శాంత, ప్రేమానంద కందులియ, బొయిపరిగుడ సమితి ప్రతినిధులు రఘునాథ్ పూజారి, నారాయణ కదమ గుడియ, నందపూర్ సమితి ప్రతినిధిగా జయరాం ఖొర, నారాయణ ముదులి, సెమిలిగుడ సమితి సోడాపలి రవి, లక్ష్మణ పాడి, పొట్టంగి సమితి బందబోయి పాడి, త్రినాథ్ పటబలి, బందుగా సమితి నుంచి కవురిక నావుక, దేవాసిస్ జివుర్, నారాయణ పట్న సమితి నుంచి నచిక, లక్ష్మీపూర్ సమితి నుంచి పద్మనాబ్ జాని, కొరాపుట్ సమితి నుంచి సదా జాని, బుంధుగాం నుంచి సమితి నవుక మెలక, రాజా కద్రక, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

డీఈఓగా రామచంద్ర నాహక్



డీఈఓ రామచంద్ర నాహక్‌కు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

రాయగడ: జిల్లా విద్యాశాఖ అధికారిగా రామ చంద్ర నాహక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. భువనేశ్వర్‌లో గల విద్యాశాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన నాహక్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇదివరకు విద్యాశాఖ అధికారిగా ఉన్న బసంత కుమార్ నాయక్ కటక్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాహక్‌కు ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

దడేంగ్ జలపాతాన్ని అభివృద్ధి చేయాలి



మోహానా బీడీఓ రాజీవ్ దాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మలాస్‌పదర్ గ్రామ పంచాయతీ వద్ద దడేంగ్ జలపాతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేయాలని మోహానా బ్లాక్ సామాజిక వర్గం ప్రతినిధులు సోమవారం మోహానా బీడీఓ రాజీవ్ దాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జలపాతానికి చేరుకోవడానికి పీడబ్ల్యూడీ, గ్రామీణ రోడ్డు, రోప్ వే, విశ్రాంత గదులు, చిల్డ్రన్ పార్క్, కేఫ్, రెస్టారెంట్, గెస్ట్ హౌస్, గిరిజన మ్యూజియం, మాకందుని అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. బీడీఓను కలిసినవారిలో కెందుపడ, పకెలిగుడ, బంజిమా, దబ్బగుడ, కెహాలిగుడ తదితర గ్రామవాసులు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య



కుంజామి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి బపాస్‌పల్లి పంచాయతీ సీలకోట గ్రామంలో యువకుడు సుకా కుంజామి (35) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. సోమవారం ఉదయం ఇంటికి కిలోమీటర్ దూరంలో ఉన్న పొలంలోని ఓ గుడెసలో విష పండ్లు తిని పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్లిన ఓ మహిళ చూసి సుక తండ్రి ఉరా కుంజామికు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆయన్ని పోడియా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మల్కన్‌గిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరి్పంచగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోడియ పోలీసులు కేసు నమోదు చేశారు. కుంజామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. విష పండ్లను తిని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా సెక్రటరీ లెవన్



విజేతలతో అతిథులు

మల్కన్‌గిరి: జిల్లా పోడియా సమితి కేంద్రంలో పోడియా ఉన్నత పాఠశాలాలో జిల్లా సీనియర్ లెజెండ్స్ క్రికెట్ టోర్నీని సోమవారం నిర్వహించారు. ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ పోడియా వారి ఆధ్వర్యంలో మ్యాచ్‌లను నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో ప్రెసిడెంట్ ఎలెవన్ ముందుగా బ్యాటింగ్ చేసి 30 ఓవర్లలో 181 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని సెక్రటరీ లెవన్ 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎండీ ఫానూక్, జిల్లా క్రికెట్ సంఘం కర్యదర్శి పప్పు సింగ్ నేతృత్వంలో జరిగాయి. సామాజిక సేవకులు ఎస్.రాఘవరావు, సురబి బౌమిక్, నాకా నుకాలరాజు, దేవేంద్రరావు, సి.హెచ్.కుమార్ హాజరయ్యారు. మల్కన్‌గిరి, చిత్రకొండ, మత్తిలి, కలిమెల ఎం.వి-79 ప్రాంతాలకు చేందిన సీనియర్ జట్లు పాల్గొన్నాయి. విజేతలకు అతిథులు ట్రోఫీ అందజేశారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

టెక్కలి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి.. ఆపైన చదువుకున్న నిరుద్యోగ యువత ఈ నెల ఏడో తేదీలోగా అన్ని ధ్రువ పత్రాలతో కళాశాలలోని హబ్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. మూడు నెలల పాటు శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94932 90012 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రజా ఫిర్యాదుల విచారణకు అనూహ్య స్పందన

- 81 శాతం ఫిర్యాదులు పరిష్కారం: ముఖ్యమంత్రి



ప్రజల వద్దకు చేరి సమస్యల్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్: ప్రజా ఫిర్యాదుల విచారణకు అనూహ్య స్పందన లభిస్తోందని, ఈ వ్యవస్థలో అందిన ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు దాదాపు 81 శాతం పరిష్కరించినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో 8వ విడత ముఖ్యమంత్రి ప్రజా ఫిర్యాదుల విచారణ మంగళవారం జరిగింది. ఈ విడత కింద 1,000 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో 700 ఫిర్యాదులను పరిష్కరించారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు వివిధ అనుబంధ శాఖలకు సిఫారసు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు నుంచి నిర్వహించిన ఫిర్యాదుల విచారణకు ఇప్పటి వరకు 8,031 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. వీటిలో 6,545 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ లెక్కన సుమారు 81 శాతం ఫిర్యాదులు పరిష్కరించామన్నారు.

చిన్నారి వైద్య సంరక్షణకు ఆర్థిక సాయం

మంగళ వారం జరిగిన ఫిర్యాదుల విచారణ శిబిరానికి హాజరైన చిన్నారి వైద్యం, చికిత్స కోసం ముఖ్యమంత్రి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించారు. బౌద్ జిల్లాలో అరుదైన వ్యాధి (జెరోడెర్మా పిగ్మెంటోసమ్)తో దీర్ఘకాలంగా బాధపడుతున్న 7 ఏళ్ల చిన్నారి ప్రత్యూష గిరికి సింగిల్ విండో వ్యవస్థ ద్వారా రూ. 5 లక్షల సహాయం అందించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. బాధిత చిన్నారి కుటుంబానికి ఇల్లు లేదని స్పష్టం కావడంతో ఆవాస్ యోజన కింద ఇల్లు ఇవ్వాలని సంబంధిత శాఖను ముఖ్యమంత్రి ఆదేశించి అందరి మనసు దోచుకున్నారు.

ప్రజలకు విజ్ఞప్తి

90 రోజుల్లో ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేసేందుకు తరచు రాజధాని నగరం భువనేశ్వర్ రాకపోకలు అత్యంత వ్యయ ప్రయాసలతో కూడినది. ఇలా ఇబ్బంది పడకుండా స్థానిక జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో తమ ఫిర్యాదుల్ని బాధిత వర్గం దాఖలు చేస్తే సరిపోతుందని ముఖ్యమంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మీ సమస్యలు, ఫిర్యాదులను మీ సంబంధిత జిల్లా కలెక్టర్లకు తెలియజేయండి. భువనేశ్వర్‌కు వచ్చి మీ ఫిర్యాదులను జిల్లా స్థాయిలో ఇవ్వకండి' అని సీఎం మాఝి సంతకం చేశారు.



బౌధ్ జిల్లా చిన్నారి దుస్థితిని నిశితంగా సమీక్షించిన ముఖ్యమంత్రి



ప్రజా ఫిర్యాదుల్ని ప్రత్యక్షంగా స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

ఉత్సాహంగా వంటల పోటీలు



గుణుపూర్‌లో నిర్వహించిన వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్, కొలనారలో మహిళల మధ్య వంటల పోటీలు అత్యంత ఆసక్తికరంగా జరిగాయి. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుణుపూర్‌లో గల బఘువా మందిరం వెనుక నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రకాల వంటలను వండి తీసుకువచ్చిన మహిళలు వాటిని ప్రదర్శనలో ఉంచారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగొ, గుణుపూర్ పట్టణ ప్రముఖ న్యాయవాది బ్రహ్మానంద పట్నాయక్, అక్షయ దాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

కొలనారలో..

కొలనారలో గల గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో వార్షికోత్సవాల సందర్భంగా వంటల పోటీలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ రామ ప్రసాద్ పాత్రో ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలు సుమారు 160 రకాల వంటలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ తరహా పోటీలను నిర్వహించి మహిళలకు ఉత్సాహపరచడమే తమ లక్ష్యమని పాత్రో అన్నారు.

ఝురపడా జైలులో విద్యార్థి కాంగ్రెస్ నేతలతో భేటీ



నిరంజన్ పట్నాయక్ ఆధ్వర్యంలో జైలులో విద్యార్థి కాంగ్రెస్ నేతలను కలిసిన సీనియర్ నాయకులు

భువనేశ్వర్: స్థానిక ఝురపడా జైలులో బందీగా ఉన్న రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ రాష్ట్రపతి ఉదిత్ ప్రధాన్, ఇతర విద్యార్థి నాయకులను రాష్ట్ర కాంగ్రెసు సీనియర్ నాయకులు కలిసి పరామర్శించారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ ఆధ్వర్యంలో జయదేవ్ జెనా, మాజీ ఎమ్మెల్యే, విద్యార్థి మాజీ అధ్యక్షుడు దేవాశిష్ పట్నాయక్, భువనేశ్వర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బిశ్వజిత్ దాస్, మీడియా కోఆర్డినేటర్ దీపక్ కుమార్ మహపాత్రో తదితర ప్రధాన కాంగ్రెస్ నాయకులు ఝురపడా జైలు సందర్శించారు. ఈ సందర్భంగా పీసీసీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నల్ల జెండాను ప్రదర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఆ హక్కును మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం హరిస్తోందన్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని గుర్తించకుండా రామ మందిర నిర్మాణం తర్వాత 2014లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రసంగించిన ఆర్‌ఎస్‌ఎ చీఫ్ మోహన్ భగవత్‌కు నల్లజెండా చూపించిన విద్యార్థి నాయకుడు ఉదిత్ ప్రధాన్, ఇతర విద్యార్థి నాయకుల ఉద్యమానికి కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తోందని ప్రకటించారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌కు నల్ల జెండా చూపిన ఆరోపణ కింద అరెస్టు చేసిన విద్యార్థి కాంగ్రెసు నాయకుల్ని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్ర కాంగ్రెస్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

బృందావన్ ప్యాలస్‌ను సంగ్రహాలయంగా మార్చాలి



పర్లాకిమిడి శివార్లలో బృందావన ప్యాలస్ (ఫైల్)

పర్లాకిమిడి: మహేంద్రతనయ నది ఒడ్డున, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న బృందావన్ ప్యాలస్‌ను సంగ్రహాలయంగా మార్చాలని ఉత్కళహితేషినీ సభ్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు బినోద్ జెన్నా కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిని అందజేశారు. స్వర్గీయ గౌరచంద్రగజపతి హయాంలో నిర్మించిన బృందావన్ ప్యాలస్ తదనంతరం పర్లాకిమిడి మహారాజా స్వర్గీయ క్రిష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ బ్రిటీష్ పాలకులకు విహార, విడిదిగా ఉపయోగించారు. ప్రస్తుతం బృందావన ప్యాలస్ అసాంఘీక వ్యక్తులు లోపలికి వచ్చి అనేక అనైతిక కార్యాలయాలు చేయడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకుని దీన్ని చారిత్రాత్మక సంగ్రహాలయంగా మార్చాలని బినోద్ జెన్నా, హరిమోహన్ పట్నాయక్ కోరారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

టెక్కలి:



టెక్నో విజన్ సదస్సు ప్రారంభిస్తున్న సీఎస్ఐ చైర్మన్, కార్యదర్శి సుధాకర్, రమణ తదితరులు

ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) చైర్మన్ సీహెచ్ సుధాకర్ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టెక్నో విజన్ సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన వారికి ఏ కంపెనీ అయినా ఖచ్చితంగా ఉద్యోగం ఇస్తుందని చెప్పారు. మానవ మేధస్సుకు సాంకేతికత మరింత తోడుగా నిలిస్తే అద్భుతమైన విజయాలు సాధించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలు మరింత అభివృద్ధి చేయాలని సీఎస్ఐ కార్యదర్శి డి.వి.రమణ సూచించారు. ఇటువంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. ప్రతీ కళాశాల కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని, అక్కడ సమస్యలపై సాంకేతికంగా పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు సొంతంగా ఆలోచనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, అకడమిక్ డీన్ బి.వి. రమణ, సీఎస్ఈ హెచ్‌ఓడీ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- డ్రైవర్ మృతి



బోల్తాపడిన ఆటో (ఇన్‌సెట్లో) మృతుడు మోహన మురళి (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని నడగాం–శివరాంపురం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై సోమవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో చెన్నాపురం పంచాయతీ శివారు గ్రామం మొయ్యివానిపేటకు చెందిన మొయ్యి మోహన మురళి(45) మృతి చెందారు. రైల్వే కూలీలను ఆటోపై తరలించి ఇంటికి వచ్చి, తిలారులో ఆటో స్టెపినీ టైర్ మరిచిపోవడంతో తీసుకొని రావడానికి రాత్రి 10 గంటల సమయంలో వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా నడగాం–శివరాంపురంల మధ్య పోలాకి గెడ్డ వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలు పాలైన అతను అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి ఒంటి గంట సమయానికి భర్త ఇంటికి రాకపోవడంతో భార్య భాగ్యలక్ష్మి ఫోన్ చేసింది. దగ్గర్లో ఉన్నా.. వచ్చేస్తా అని చెప్పారని రాత్రింతా రాకపోవడంతో ఆందోళనతో గ్రామస్తులు రోడ్డుపై గాలించగా పోలాకి గెడ్డ వద్ద మృతిచెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. వెంటనే నరసన్నపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ అసిరినాయుడు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఉదయానికి ఎవరో మోహన మురళిని హత్య చేశారని పుకార్లు వచ్చాయి. పోలీసులు వచ్చి పరిశీలించిన తర్వాత సెల్ఫ్ ప్రమాదంగా నిర్ధారించారు. మంచు ప్రభావం కారణంతో వేగంగా వస్తూ అక్కడ ఉన్న మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడిందని భావిస్తున్నారు. మురళీ మోహన్ భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాందాసుపురంలో చోరీ

పొందూరు: మండలంలో కనిమెట్ట పంచాయతీ రాందాసుపురం గ్రామంలోని పైడి వెంకటసత్యవతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రతీరోజు మాదిరిగానే ఇంటికి తాళం వేసి ఇంటి స్లేడ్‌పై తాళంచెవి పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లిపోయామని, సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో నగదు, బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఘటనలో రూ.76 వేల నగదు, తులంపావు బంగారం చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. నిత్యం ఇంటికి తాళం వేసి అక్కడే పెట్టడం గమనించిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఎస్ఐ సత్యనారాయణ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఇంటికి వస్తూ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట గ్రామానికి చెందిన కాగితాపల్లి వెంకటరమణ (44) సికింద్రాబాద్ ఆర్మీ ప్రధాన కార్యాలయం (ఏవోసీ)లో పనిచేస్తూ జనవరి 31వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈనెల 2వ తేదీ ఆదివారం తన స్వగ్రామం బొర్రంపేట వచ్చేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అయితే రైలు కోసం వేచిఉన్న వెంకటరమణ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా గుండెనొప్పితో మృతి చెందాడు. పదవీ విరమణ చేసిన రెండు రోజుల్లోనే తమ కళ్లముందే కుప్ప కూలి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి ఇద్దరు కుమార్తులు ఉన్నారు.

ఖరీఫ్ వరి సేకరణపై మంత్రుల బృందం సమావేశం



ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రుల బృందం సమావేశం

భువనేశ్వర్: ఖరీఫ్ సీజన్ వరి సేకరణ తాజా స్థితిగతుల్ని మంత్రుల బృందం సమీక్షించింది. ఈ సందర్భంగా ఈ ఏడాది వరి సేకరణ లక్ష్యం పరిమితిని విస్తరించింది. లోగడ ఖరీఫ్ సీజను వరి సేకరణ లక్ష్యం 65 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 77 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచేందుకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. కనీస మద్దతు ధర రూ. 2,300, సాగు పెట్టుబడి కింద అదనంగా రూ.800 జోడించడంతో క్వింటాల్ వరి కనీస మద్దతు ధర సమగ్రంగా రూ. 3,100గా ప్రభుత్వం ఖరారు చేసిన విషయం విదితమే. దీని ప్రభావంతో ఎక్కువ మంది రైతులు వరి విక్రయంపై సుముఖత వ్యక్తం చేసి ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. రైతుల ప్రయోజనం కోసం వరి సేకరణ పరిమితిని విస్తరించేందుకు మంత్రుల బృందం నిర్ణయించినట్లు వివరించింది. స్థానిక లోక్‌సేవా భవన్‌లోని మూడో అంతస్తు సమావేశ హాలులో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ డియో అధ్యక్షతన మంత్రుల బృందం సమావేశం జరిగింది. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో, సహకార శాఖ మంత్రి ప్రదీప్ బాల సామంత, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్ రాష్ట్రంలో ఖరీఫ్ సీజను వరి సేకరణ స్థితిని సమావేశంలో ప్రవేశ పెట్టారు. ఈ సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 9 లక్షల 77 వేల 293 మంది రైతుల నుంచి 46 లక్షల 36 వేల 541 మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేశారు. దాదాపు రూ. 10,000 కోట్లు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)గా, రూ. 3,500 కోట్లు సాగు పెట్టుబడి ఖాతా కింద రైతుల ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ చేశారు. ఈ ఏడాది కొనుగోళ్లలో రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీసీటీవీల ఏర్పాటుతో అవకతవకలు, అక్రమాల నివారణ ప్రత్యక్ష పర్యవేక్షణ కోసం 3,883 మంది నోడల్ అధికారులను నియమించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వరి రాష్ట్రంలోనికి చొరబడకుండా బయటి వాహనాలపై నిఘా ఉంచడానికి 217 ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారం

రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రైతులకు టోకెన్లు, ఇన్‌పుట్ సపోర్ట్, ఎంఎస్‌పీ సహా వరి విక్రయాలకు సంబంధించిన వివిధ ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1967 ద్వారా 4 లక్షల 15 వేల 267 నమోదైన ఫిర్యాదులు పరిష్కరించారు.

పారదర్శక ప్రక్రియ

వరి సేకరణ ప్రక్రియ పారదర్శక మెరుగుదల కోసం ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు జిల్లా స్థాయిలో మండీల నిర్వహణ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. దీంతో వరి కొనుగోలు తదితర అనుబంధ కార్యకలాపాల్లో పారదర్శకత విజయవంతమైందని వ్యవసాయం, రైతు సాధికారిత శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. రానున్న రబీ సీజన్‌లో వరి కొనుగోలుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అనుబంధ వర్గాలకు ఆయన సూచించారు.

సంప్రదాయబద్ధంగా ముండా యాత్ర



అమ్మవారికి మేకను మొక్కుతున్న మహిళ



గ్రామదేవత ఆలయం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా పనస్‌పూట్ పంచాయతీని గ్రామదేవతతా ఆలయం వద్ద నిశాణి ముండా యాత్రను గిరిజనులు సంప్రదాయబద్ధంగా సోమవారం నిర్వహిచారు. మాఘమాసంలో ఈ యాత్ర మూడు రోజులు జరగనున్నాయి. ఇందులో భాగంగా యాత్ర జరిగే మూడురోజులు గ్రామస్తులు బయటకు వెళ్లకుండా ఆలయం వద్దే ఉంటూ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. చివరి రోజున గ్రామదేవతలకు జంతుబలి ఇచ్చి.. ఆ మాంసాన్ని అందరూ కలిసి వండుకొని సామూహికంగా భోజనం చేస్తారు.

సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం



జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్‌కి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం/కంచిలి/వజ్రపుకొత్తూరు/సోంపేట: జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వివిధ రైల్వే స్టేషన్లలో ఆయన సోమవారం పర్యటించారు. ఇచ్ఛాపురంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మిలు కలిసి రత్తకన్న రోడ్‌లోని ఎల్‌సీ గేట్ సమీపంలో అండర్‌పాస్, పాతాళ సిద్ధేశ్వరాలయం వద్ద నిర్మించిన జగనన్న కాలనీకి వెళ్లేమార్గంలో రైల్వే అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రైలు నిలయంలో అదనంగా మరికొన్ని ముఖ్యమైన రైళ్ల నిలుపుదల చేయాలన్నారు. అదేవిధంగా వివిధ స్టేషన్లలో ప్రజాప్రతినిధులు కలిసి వినతిపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాళ్ల ధర్మారావు, బుద్దాల నిర్మల, జి.సాయి కామేష్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస్ రౌలో, బచ్చు జగన్, సల్లా దేవరాజు, రైల్ యూజర్ కమిటీ సభ్యులు అనపాన దొరబాబు, బత్తుల తిరుమల, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుమ్మిడి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పినముప్పు



మంటల్లో దగ్ధమవుతున్న కారు

జలుమూరు: సురవరం పంచాయతీ పరిధి దొంపాక వద్ద ఆదివారం మధ్యాహ్నం కారులో మంటలు వ్యాపించి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం మద్దిలపాలెనకు చెందిన ఐదు కుటుంబాలు నాలుగు వాహనాల్లో సుమారు 20 మంది అరసవల్లి, శ్రీకూర్మాం పుణ్యక్షేత్రాలు దర్శించుకొని శ్రీముఖలింగం బయల్దేరారు. తిమడాం వద్ద కారు కింద భాగంలో అపరాలైన మినప పంట తొక్కు అడ్డు రావడంతో సుమారు కిలోమీటరు దూరం వరకు చిన్న మంటలు, పొగలు వ్యాపించాయి. కారు వెనకే వస్తున్న ఒక ఆటో డ్రైవర్ ఈ కారును వెంబడించి మంటలు చెలరేగుతున్నాయని హెచ్చరించారు. అలాగే దొంపాక వద్ద అక్కడ మినప పంట నూర్పుతున్న రైతులు కొందరు పెద్ద కేకలు వేసి కారు కిందభాగంలో మంటలు, దట్టమైన పొగ వస్తోందని అరిచారు. దీంతో ఏం జరుగుతోందని కారు నడుపుతున్న శోభారాణి కారును నిలుపుదల చేసింది. ఇంతలో దట్టమైన పొగలు, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఏం చేయాలో తోచక ఒక్కసారిగా కారులో ఉన్న శ్రీను బాబు, సోని, చంద్రిక, శ్యామ్‌లు బయటకు వచ్చారు.

మినప తొక్కే ప్రమాదానికి కారణం

ఇదిలా ఉండగా ఈ ప్రమాదం కారు కింద భాగంలో షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, మినప తొక్కు వల్ల జరిగిందా అనేది గుర్తించలేదు. దొంపాక వద్ద రైతులు రోడ్డు మీద పెట్టిన మంటలు వల్లే ఇలా జరిగిందని బాధితులు చెప్పారు. అయితే తిమడాం వద్ద మినప తొక్కు అడ్డం తగిలి రోడ్డుకు బలంగా ఈడ్చుకెళ్లడంతో పొగలు వ్యాపించి మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయని అక్కడ స్థానిక రైతులు, ఆటో డ్రైవర్ చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సుమారు గంటన్నర సమయం వరకూ దట్టమైన పొగలు, పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో కారు టైర్లు పెద్ద శబ్దాలతో పేలిపోయాయి. దీంతో కారులో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతయ్యిందని బాధితులు బోరున విలపించారు. ప్రమాదం జరిగిన వెంటనే నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావుకు వారు ఫోన్‌లో సమాచారం అందించారు. అలాగే అగ్నిమాపక కేంద్రం కోటబొమ్మాళి, నరసన్నపేట చేయగా వారు వేరే చోట అగ్ని ప్రమాదం ఆర్పే ప్రయత్నంలో ఉన్నామన్నారు. దీంతో టెక్కలి నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను నిలుపుదల చేశారు.

క్లుప్తంగా

నేడు శంబర పోలమాంబ మారుజాతర


శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, సీఐ రామకృష్ణలు ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం రథసప్తమి పండగ కారణంగా భక్తుల రద్దీ తక్కువగా ఉంటుందేమోనని, అధికారులు భావిస్తున్నప్పటికీ, రద్దీ ఎక్కువైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని. అందుకు తగ్గ ఏర్పాట్లు అధికారులు చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వనంగుడి, చదురుగుడిల వద్ద క్యూలు ఏర్పాటుచేశారు. క్యూల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు 15వేల లడ్డూ, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశారు. సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా 150మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

పారా అథ్లెటిక్స్‌లో గోల్డ్‌మెడల్


పారా అథ్లెటిక్స్‌లో పాల్గొన్న విద్యార్థి

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి పి.రాజేష్ ఆదివారం మంగళగిరిలో జరిగిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. పీపీ ఊత మానుగూడ గ్రామ సర్పంచ్ కుమారుడైన విద్యార్థి ఐదోతరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతూ క్రీడలపై ఆసక్తి కనబరుస్తున్నాడు. రాజేష్ గోల్డ్‌మెడల్ సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జోగింపేట ప్రతిభా పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: సీతానగరం మండలంలోని జోగింపేట ప్రతిభా పాఠశాల/కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి 8వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంగ్లమాధ్యమంలో ప్రవేశానికి మార్చి 23 లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూ గురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 8 వతరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 7వ తరగతి పాస్ అయిన వారు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 2024–25లో 10 వతరగతి చదివి పాస్ అయి ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.1,00,000లు మించి ఉండరాదని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఈ నెల 3 నుంచి మార్చి 2 వరకు గడువు ఉందని, కామన్ ఎంట్రన్స్ టెస్టు మార్చి 9న జోగింపేట ప్రతిభా పాఠశాల విద్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం మండలం కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల ఉత్కర్ష్ బనాకా అనే విద్యార్థి తప్పిపోగా, రూరల్ పోలీసులు ఆ బాలుడిని అగర్తలాలో కనుగొని, తల్లిదండ్రులకు జిల్లా పోలీసు కార్యాలయంలో అప్పగించారు. కోరుకొండ సైనిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉత్కర్ష్ బనాక కనిపించడం లేదని సైనిక్ స్కూల్ స్టాఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ పోలీసులు బాయ్ మిస్సింగ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విషయంలో ఎస్పీ ప్రత్యేక దృష్టి శ్రద్ధ కనబర్చి, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి, అన్ని విభాగాలకు అబ్బాయి వివరాలు పంపి, కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు విచారణ చేసి ఉత్కర్ష్ బనాక చివరకు అగర్తలాలో ఉన్నట్లు గుర్తించి విజయనగరం తీసుకువచ్చి తల్లిదండ్రులు మోహన్ బనాక, స్మితలకు ఎస్పీ సోమవారం అప్పగించారు.

5న తోటపల్లిలో విగ్రహ పునఃప్రతిష్ఠ

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5నుంచి 8 వరకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ వీవీ సూర్యనారాయణ తెలిపారు. తోటపల్లిలో స్వయంభూగా వెలసిన శ్రీ పద్మావతిసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి నూతన ధ్వజ, యంత్ర, శిఖర, గరుడ పరివార దేవతా సహితంగా పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ విధానంగా బ్రహ్మశ్రీ కొడవటిగంటి వేంకట నరసింహాచార్యుల పర్యవేక్షణలో, టీటీడీ వేదపండితుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5,6,7 తేదీల్లో పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించిన తరువాత 8న వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా కల్యాణాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సరస్వతీ నమస్తుభ్యం


చిన్నారుల తలపై పలకలను ఉంచి అక్షర ఆశీస్సులు అందిస్తున్న తల్లిదండ్రులు


చిన్నారులు రాసే పలకలను అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు


చిన్నారితో అక్షరాలను దిద్దిస్తున్న తల్లిదండ్రులు

ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

వసంత పంచమి పర్వదినాన సోమవారం విజయనగరం రింగురోడ్డులో ఉన్న లక్ష్మీ భువనేశ్వరి సమేత జ్ఞానసరస్వతి ఆలయంలో అక్షర మంత్రం ప్రతిధ్వనించింది. చిన్నారుల సామూహిక అక్షరాభ్యాసంతో ఆలయ ప్రాంతం సందడిగా మారింది. ఉదయానికే వేలాది మంది తమ పిల్లలతో ఆలయానికి చేరుకున్నారు. బ్యాచ్‌ల వారీగా సాయంత్రం 6 గంటల వరకు అక్షరాభ్యాస క్రతువులో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ పిల్లలతో అక్షరాలు దిద్దించారు. శ్రీశారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో వందలాది మంది వలంటీర్లు భక్తులకు సేవలను అందించారు. చిన్నారులకు పాలు, మజ్జిగ, మంచినీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సుమారు 15వేల మంది భక్తులు పాల్గొన్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

– విజయనగరం టౌన్

కేన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే.. జీవితమే క్యాన్సిల్

- ఏటా పెరుగుతున్న కేసులు
- త్వరగా గుర్తిస్తే ఫలితం
- జిల్లాలో నోటి, రొమ్ము, కేన్సర్‌లు ఎక్కువగా నమోదు
- ఏడాదికి 600నుంచి 800 వరకు కొత్త కేసులు
- నేడు వరల్డ్ కేన్సర్ డే


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బయాప్సీ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్


నోటి కేన్సర్ పరీక్ష చేస్తున్న దంత వైద్యుడు


ఎఫ్‌ఎన్‌ఏసీ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

2024లో నమోదైన కేసుల వివరాలు	
ఓరల్ కేన్సర్	321
బ్రెస్ట్ కేన్సర్	233
సర్వైకల్ కేన్సర్	216

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాప్తి అధికమవుతోంది. పూర్వీకులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల అతి తక్కువ మంది మాత్రమే క్యాన్సర్ బారిన పడేవారు. కాని నేటి మానవులు పాశ్చాత్య పోకడలకు పోయి పిజ్జాలు, బర్గర్ల వంటివి అధికంగా తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణంతక వ్యాధుల బారిన పడుతున్నారు. మంగళవారం వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. గతంతో పోల్చితే కేన్సర్ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామాల్లో అవగాహన లేక గతంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేవారుకాదు. దీంతో సదరు రోగులు ఏవ్యాధితో చనిపోయారో తెలిసేది కాదు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స చేయించుకోవాలనే ఆలోచన వస్తోంది. కేన్సర్ స్క్రీనింగ్ పెరగడం వల్ల వ్యాధి ఎంతమందికి ఉందో తెలుస్తోంది. చాలా మంది కేన్సర్ అనగానే భయందోళన చెందుతారు. దీని వల్ల త్వరగా చనిపోతున్నారు. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన పనిలేదు. అయితే ప్రాణాంతకమైన కేన్సర్‌ను కూడా ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్ వాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. అవగాహన రాహిత్యం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వెరసి ప్రజలు కేన్సర్ బారిన పడుతున్నారు. కాలంతో పాటు జీవనశైలిలో మార్పులు, కాలుష్యం, అలవాట్లు, ఆహార పదార్థాలు, ఇలా అనేక కారణాలు వల్ల కేన్సర్ వస్తుంది. ప్రాథమిక దశలో దానిని గుర్తించి చికిత్స పొందడం ద్వారా మరణాన్ని జయించవచ్చు. ఇప్పటికే ఎంతో మంది ఈ తరహా చికిత్స తీసుకుంటూ బతికి బయటపడ్డారు.

వ్యాధి నిర్ధారణ ఇలా..

కేన్సర్ వ్యాధిని పలు పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు. ఎఫ్‌ఎన్‌ఏసీ, పాప్స్మీయర్, బయాప్సీ పరీక్షల ద్వారా వైద్యులు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఈ పరీక్షలు విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది.

వ్యాధి లక్షణాలు

ఖైనీ, గుట్కా,పాన్ పరాగ్, డీలక్స్, పొగాకు వంటివి తినడం, పొగ తాగడం వల్ల కేన్సర్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వీటి వల్లే వస్తుంది. రొమ్ము కేన్సర్ జన్యుపరమైన కారణాలతో వస్తుంది.బయట ఫుడ్స్ తినడం వల్ల జీర్ణాశయ కేన్సర్ వస్తుంది.

నాలుగు దశలు

కేన్సర్‌లో నాలుగు దశలు ఉన్నాయి. మొదటి దశలో కేన్సర్ కణాల్ని స్క్రీనింగ్ ద్వారా గుర్తించి సరైన చికిత్స అందించవచ్చు. ఇలా చేయడం ద్వారా 95 నుంచి 100 శాతం వరకు వ్యాధినయం చేయవచ్చు. రెండో దశలో కేన్సర్ కణాలు ఒక భాగం నుంచి ఇతర భాగాలకు కొంచెం, కొంచెంగా విస్తరించడం ప్రారంభమవుతుంది. వాటికి రేడియోథెరపీ అందిస్తే 70 నుంచి 80 శాతం వరకు పూర్తి స్థాయిలో నయమవుతుంది. ఇక మూడో దశలో కేన్సర్ ఇతర భాగాలకు పూర్తిగా విస్తరిస్తుంది. రేడియోథెరపీ, కీమోథెరపీ ఇస్తే 50 నుంచి 60 శాతం మందికి తగ్గుముఖం పడుతుంది. ఇక చివరి దశలో కేన్సర్ కీలకమైన అవయవాలకు సోకుతాయి. ఇలాంటి వారికి చికిత్స అందించినా ఆశించిన ఫలితం ఉండదు. కేవలం 5 నుంచి 10 శాతం మంది మాత్రమే బతికే అవకాశాలుంటాయి.

కేన్సర్‌లో రకాలు

కేన్సర్‌లో పలు రకాలు ఉన్నాయి. మహిళల్లో అధికంగా గర్భాశయ కేన్సర్, రొమ్ము కేన్సర్ సోకే అవకాశం ఉంది. పురుషుల్లోను, పొగ తాగే వారిలో గొంతు, నోటి కేన్సర్ వ్యాప్తి అధికంగా ఉంటుంది. చిన్న పిల్లల్లో బ్లడ్‌కేన్సర్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జిల్లాలో ఏడాదికి 600 నుంచి 800 మంది వరకు కేన్సర్ బారిన పడుతున్నారు. ఈ కేసుల్లో ఎక్కువ నోటి కేన్సర్‌లే అధికంగా ఉంటున్నాయి.

బాధితుల్లో ధైర్యం నింపాలి




కేన్సర్ అనగానే వ్యాధిగ్రస్తులు భయపడతారు. కాబట్టి కేన్సర్ సోకిన వారిలో ధైర్యం నింపాలి. కేన్సర్ వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్న విషయాన్ని చెప్పాలి. రొమ్ము కేన్సర్‌ను త్వరగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. గర్భాశయ కేన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 11నుంచి 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ కేన్సర్ రాకుండా వేసుకోవచ్చు. నెల రోజుల వ్యవధిలో రెండు డోసులు వేసుకోవాలి. 40 ఏళ్లు దాటిన మహిళలు మామో గ్రఫీ పరీక్ష చేయించుకోవాలి. బయట ఆహారం ఎక్కువగా తినకూడదు. ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్, తినడం, పొగతాగడం, మద్యం తాగడం పూర్తిగా మానివేయాలి.

– డాక్టర్ పోతుల విజయలక్ష్మి, మెడికల్ అంకాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

రాములోరి పెళ్లికి వేళాయె..!

- నేటి నుంచి తిరుక్కల్యాణ, రథయాత్ర మహోత్సవాలు
- ఈ నెల 8న సీతారాముల వార్షిక కల్యాణోత్సవం
- 11న రథంపై ఊరేగనున్న శ్రీరామ చంద్రమూర్తి
- 26 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- సిద్ధమవుతున్న దేవస్థానం అధికారులు


స్వామివారి ఉత్సవ విగ్రహాలు


రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వెలిసిన శ్రీ సీతా రామస్వామివారి దేవస్థానంలో స్వామివారి తిరుక్కల్యాణ, రథయాత్రతో పాటు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సిద్ధం చేశారు. క్యూల నిర్వహణ, ప్రసాదాల తయారీ, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటికి టెండర్ల ప్రక్రియ ద్వారా ఆహ్వానించేందుకు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉత్సవాల విస్తృత ప్రచారానికి దేవస్థానం అధికారులు, సిబ్బంది సమాయత్తమయ్యారు. మంగళవారం నుంచి స్వామి సన్నిధిలో ఉత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. సీతారాముల వార్షిక కల్యాణం సందర్భంగా మంగళవారం ఉదయం 8:30 గంటలకు తూర్పు రాజగోపురం ఎదుట స్వామివారి పందిరిరాట మహోత్సవాన్ని అర్చకులు నిర్వహించనున్నారు.

8న సీతారాముల వార్షిక కల్యాణం

దేవస్థానం ఆస్థాన కల్యాణ మంటపంలో ఈ నెల 8న సీతారాముల వార్షిక కల్యాణం జరగనుంది. నిత్య పూజలు, దీక్షాధారణ, మంగళాశాసనం, బుధవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠాపన, బలిహరణం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించి ఆ రోజు రాత్రి 7.30గంటలకు స్వామివారి మూడు వాహనాల సేవ జరిపిస్తారు. ఇందులో భాగంగా మూడు వాహనాలపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను అశేష భక్తజనం నడుమ రామతీర్థం పుర వీధుల్లో ఊరేగించి దేవాలయానికి తీసుకువస్తారు. అనంతరం రాత్రి 9.30 గంటలకు సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించనున్నారు.

11న రథయాత్ర మహోత్సవం

తిరుక్కల్యాణ, రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామస్వామి వారి సన్నిధిలో శ్రీ మద్రామాయణ పారాయణం, వేదపఠనం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, విశేషహోమాలను ప్రతి నిత్యం నిర్వహిస్తారు. 11వ తేదీన రాత్రి 10గంటలకు రథయాత్ర మహోత్సవాన్ని వేడుకగా జరపనున్నారు. సీతారామచంద్రస్వామి రామతీర్థం తిరువీధుల్లో రథంపై ఊరేగుతూ పయనిస్తూ భక్తులకు సాక్షాత్కరిస్తారు. 13న సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పుష్పాంజలి, పవళింపు సేవను నిర్వహించి తిరుక్కల్యాణ, రథయాత్ర మహోత్సవాలను పూర్తి చేయనున్నారు.

26 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ఈ నెల 26 నుంచి 28 వరకు రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో ఉమా సదాశివుడి దర్శనంతో పాటు వేద పారాయణం, పంచామృతాలతో శ్రీరామచంద్ర ప్రభువుకు స్నపన మహోత్సవాలను జరిపించనున్నారు. మూడురోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు.

ఉత్సవాలకు సిద్ధం

రామతీర్థంలో స్వామివారి తిరుక్కల్యాణం, రథయాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. స్వామివారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని మంగళవారం దేవస్థానం ప్రాంగణంలో పందిరి రాట వేస్తున్నాం. వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సిద్ధం చేసి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉత్సవాలకు సంబంధించి ప్రచారాన్ని నిర్వహిస్తాం. జిల్లాలో ప్రముఖులందరికీ ఇప్పటికే ఆహ్వాన పత్రికలను అందజేశాం. శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయడమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులతో ముందస్తుగా సమావేశాలను నిర్వహిస్తాం.

– వై శ్రీనివాసరావు, సహాయ కమిషనర్, ఈఓ, రామతీర్థం దేవస్థానం

బంగారం కోసమే హత్య

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం: తీవ్ర సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ముందుగా అంతా ఊహించినట్లుగానే బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నెల రోజులుగా ఎంతో ఉత్కంఠగా ఉన్న ఈ కేసు మిస్టరీ వీడడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. నిందితుడు బంగారం కోసమే మహిళను హత్య చేసినట్లు చెప్పారు. చోడవరం మండలం లక్కవరం పంచాయతీ శివారు మారుతీనగర్ సమీపంలో గవరవరం వెళ్లే రోడ్డు పక్కన ఈ ఏడాది జనవరి 9వ తేదీన పొలంలో లక్కవరం గ్రామానికి చెందిన ఒబలరెడ్డి నరసమ్మ అనే మహిళ హత్యకు గురైంది. మేకల కోసం గడ్డి కోసేందుకు కత్తి పట్టుకుని ఆమె వెళ్లింది. గడ్డికోసం వెళ్లిన తన భార్య చీకటి పడినా రాకపోవడంతో భర్త నర్సింహమూర్తి వెతుకుతుండగా బండారు లక్ష్మయ్యకు చెందిన పొలంలో రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించి చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో చోడవరం ఎస్సై అప్పలరాజు, ఎస్సైలు నాగకార్తీక్‌తో కూడిన పోలీసు, ప్రత్యేక ఐటీ కోర్, క్రైమ్ పోలీసు బృందాలను రంగంలోకి దింపగా వారంతా సకాలంలో పూర్తి వివరాలు సేకరించి నిందితుడ్ని చోడవరం మండలం గజపతినగరం వద్ద సోమవారం ఉదయం పట్టుకున్నారని ఎస్పీ చెప్పారు.

నిందితుడిది కొత్తవలస

నిందితుడిని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం జమ్మాదేవి పేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారాన్ని అపహరించాడన్నారు. అపహరించిన బంగారాన్ని కొత్తవలస ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.1.85లక్షలకు తాకట్టు పెట్టినట్టు గుర్తించామన్నారు. ఆ డబ్బులను నేరుగా నిందితుడే ఏటీఎంల ద్వారా లావాదేవీలు నిర్వహించాడని చెప్పారు. ఆ సమయంలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించి ఏపీతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వెతికామన్నారు. నిందితుడి దగ్గర నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఆ సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కాగా కోర్టు రిమాండ్ విధించిందని ఎస్పీ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ విజేతలకు అభినందన


పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల విజేతలకు అభినందనలు వెల్లువెత్తాయి. ఆంధ్ర చెస్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా వేదికగా నిర్వహించిన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న ఫైర్ చెస్ స్కూల్‌లో ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈవో కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో వందమంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో విజేతలకు వేర్వేరుగా నగదు బహుమతులు అందించారు. ఓపెన్ కేటగిరీలో బాలుర విభాగంలో యశ్వంత్, వెంకట రావు, మణికంఠ, కృష్ణ సాయి సూరజ్‌లు విజేతలుగా నీలవగా బాలికల విభాగంలో అనన్య, సత్య శ్రీ వల్లి, సాయిధృతి, వైష్ణవి విజేతలుగా నిలిచారు. ఈ పోటీలలో ఫైర్ చెస్ సిబ్బంది పి. అర్చన, కె. ధనలక్ష్మి, ఎ.దామోదర రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రామారావు మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో గత నెల 27వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విశాఖపట్నం జిల్లా డాబాగార్డెన్స్‌కు చెందిన ఎ.మురళీకృష్ణ (43) సోమవారం మృతి చెందినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాబాగార్డెన్స్ నుంచి పెళ్లి కార్డులు పంచేందుకు తన ద్విచక్రవాహనంపై మురళీకృష్ణ గత నెల 27వ తేదీన ఎస్.కోట వచ్చి తిరుగు ప్రయాణంలో సీతారాంపురం గ్రామం సమీపంలో రోడ్డుపై రాంగ్ పార్కింగ్ చేసిన ఆటోను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాల పాలవగా 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కనక మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మరో వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని కర్రివలసలో గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం మండలం గొల్లలపేట గ్రామానికి చెందిన కుంబంగి రామారావు, మండలంలోని కర్రివలస గ్రామంలో నివాసం ఉంటున్న తన చెల్లి ఇంటికి చుట్టరికానికి వచ్చి ఆమె ఇంటి వద్ద నాలుగు రోజులుగా ఐరన్ షెడ్ పనులు చేపడుతున్నాడు, అందులో భాగంగా ఆదివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తన చేతిలో ఉన్న ఇనుప ఊచలు ఇంటిపైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను తాకడంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు, వెంటనే కుటుంబసభ్యులు సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో సైబర్ నేరాల దర్యాప్తు చేపట్టాలి


సమావేశంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాలపై ఆధునిక సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ మాధవ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్‌సెల్, ఐటీ కోర్ టీం అధికారులు, సిబ్బంది పనితీరుపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, వాటివల్ల ప్రజలు కష్టబడి సంపాదించుకున్న నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుంటున్నారన్నారు. సైబర్ మోసాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించి సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబరు క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదయ్యే విధంగా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు అందే విధంగా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ కోరారు. కాలానుగుణంగా పోలీసు సిబ్బంది కూడా టెక్నాలజీ మీద పరిణితి చెందాలని సూచించారు. సమావేశంలో సోషల్ మీడియా, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై రవీంద్ర రాజు, సైబర్‌సెల్, ఐటీ కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

నన్ను చంపాలని చూస్తున్నారు

- పార్వతీపురం ఎమ్మెల్యేపై మహిళ తీవ్ర ఆరోపణలు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


మీడియాతో మాట్లాడుతున్న చుక్క శ్రీదేవమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తనను చంపాలని చూస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని మండలంలోని పెద బొండపల్లి గ్రామానికి చెందిన చుక్క శ్రీదేవమ్మ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద విలేకరులతో సోమవారం ఆమె మాట్లాడుతూ ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి అసలు విషయం తెలుసుకోకుండా భూ కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి వస్తున్న ఆస్తులు, తాను సంపాదించిన ఆస్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్‌నగరం, మడకవానివలస, పెదబొండపల్లి గ్రామాలకు తాను వెళ్తే చంపేయమని కొంత మందికి ఎమ్మెల్యే చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తామని చెప్పి, కనీసం మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నారని వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా తన పూర్వీకుల నుంచి వచ్చిన గ్రామంలోని తమ సొంత భూమిలో విద్యుత్ సదుపాయం పొందేందుకు భారీగా డబ్బు చెల్లించి కనెక్షన్ తెచ్చుకుని లెమన్‌గ్రాస్, పట్టుపురుగుల పెంపకం చేస్తూ ఆదర్శవంతమైన మహిళగా వ్యవసాయం చేస్తున్నానన్నారు. అక్కడే ఓ ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. అయితే ఎమ్మెల్యే విజయచంద్ర కొంత మంది వ్యక్తులతో కలిసి వచ్చి తన ఇంటిని అక్రమంగా కూల్చివేయించారని, ఇంట్లో ఉన్న వ్యవసాయ పరికరాలు, ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులను ఎమ్మెల్యే ప్రోత్సాహంతో కొందరు దోచుకున్నారని తెలిపారు. ఇంటిని, పరిసరాలను జేసీబీ ఓనర్, డ్రైవర్ వంగపండు రమేష్ జేసీబీతో పడగొట్టారని వాపోయారు. తన భూములు పూర్వీకుల నుంచి వచ్చినవేనని, అవి ప్రభుత్వ భూములు కావని, ఆ భూమికి సంబంధించిన రికార్డులు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు.